క్లుప్తంగా

నాటుసారా, మద్యం ధ్వంసం



నాటుసారా, మద్యాన్ని పారబోస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

కావలి రూరల్‌: కావలి సెబ్‌ పరిధిలో గత కొంత కాలంగా వివిధ ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తూ, తయారు చేస్తూ పట్టుపడిన నాటుసారా, మద్యంను శనివారం ఎస్‌ఈబీ అధికారులు ధ్వంసం చేశారు. ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్‌ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరు కేసుల్లో పట్టుకున్న 92 లీటర్ల నాటు సారా, 11 మద్యం కేసులు, ఇతర రాష్ట్రాలకు చెందిన 9 లీటర్ల 13 మద్యం సీసాలను జిల్లా ఎస్‌ఈబీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముసునూరు వద్ద రైల్వే ట్రాక్‌ పక్కన చెరువులో ధ్వంసం చేశామన్నారు.

వాహనాల వేలం

కావలి రూరల్‌: కావలి ఎస్‌ఈబీ స్టేషన్‌ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. ఎస్‌ఈబీ సూపరింటెండెంట్‌ ఎస్‌.రవికుమార్‌ మాట్లాడుతూ కావలి స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో స్టేషన్‌ పరిధిలో పట్టుబడిన 3 వాహనాలు 2 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోకు వేలం నిర్వహించామన్నారు. 3 వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర సుమారు రూ.1,55,000 కాగా వేలం ద్వారా రూ.1,58,200 లభించిందన్నారు. జీఎస్టీ ద్వారా అదనంగా రూ.18,984 ప్రభుత్వానికి రాగా మొత్తం రూ.1,77,184 ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే 14.3 శాతం అదనంగా ఆదాయం వచ్చిందన్నారు. ఈ వేలంలో కావలి ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్‌ కె.శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదనపు డీఎంహెచ్‌ఓ తనిఖీ



మాట్లాడుతున్న ఖాదర్‌వలి

ఆత్మకూరురూరల్‌(మర్రిపాడు): మర్రిపాడు పీహెచ్‌సీలో అడిషనల్‌ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆస్పత్రిలో నిల్వ ఉన్న మందులు, రోగులకు అందుతున్న సేవలతో పాటు రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఆశ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రానున్న సీజన్‌లో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని క్షేత్రస్థాయిలో బాధ్యులైన ప్రతి ఒక్కరూ అంకిత భావంతో వైద్యసేవలు అందించాలని కోరారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ గోపీనాథ్‌, హెల్త్‌ సూపర్‌వైజర్‌ కొండారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్‌పై పోలీసులకు ఫిర్యాదు



ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న సోషల్‌ మీడియా కార్యకర్తలు

కలిగిరి: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ నేత లోకేశ్‌పై వైఎస్సార్‌సీపీ సోషల్‌ మీడియా కార్యకర్తలు కలిగిరి ఎస్సై ఎం.సూర్యప్రకాష్‌రెడ్డికి శనివారం ఫిర్యాదు చేశారు. 2019 నుంచి 2024 వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరిపై ఎక్కువ కేసులు ఉంటే వారికి నామినేటెడ్‌ పదవులు కేటాయిస్తామని లోకేశ్‌ రాష్ట్రంలో అరాచకాలకు ఉసిగొల్పుతున్నారన్నారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్‌ మీడియా కార్యకర్తలు కుట్టుబోయిన పవన్‌, సంగన మధుసూదన్‌రెడ్డి, యలపల తిరుపాలు పాల్గొన్నారు.

గేదెలను చంపేస్తున్నారని ఫిర్యాదు

ఉదయగిరి: అటవీ ప్రాంతాలకు మేతకు వెళ్లిన గేదెలు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయని మండలంలోని దాసరపల్లికి చెందిన సయ్యద్‌ మహబూబ్‌బాషా తదితరులు ఎస్సై ఇంద్రసేనారెడ్డికి శనివారం ఫిర్యాదు చేశారు. తమ పాడి గేదెలు ఈ నెల 19న గ్రామ సమీపంలోని దక్షిణం వైపు ఉన్న అటవీ ప్రాంతానికి మేతకు వెళ్లాయన్నారు. రోజులు గడుస్తున్నా గేదెలు ఇంటికి రాకపోవడంతో వెతికామన్నారు. ఈ నెల 24న గేదెలు అటవీ ప్రాంతంలో మృతి చెంది ఉండడాన్ని గుర్తించామన్నారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వేట కోసం విద్యుత్‌ కంచెలు ఏర్పాటు చేయడంతో గేదెలు వాటిని తగిలి మృత్యువాత పడ్డాయన్నారు. వాటి విలువ సుమారు రూ.1.85 లక్షలు ఉంటుందన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వన్యప్రాణుల కోసం విద్యుత్‌ తీగలు ఏర్పాటు చేస్తుండటంతో గేదెలు, ఆవులు, అడవి జంతువులు మృత్యువాత పడుతున్నాయని, అటవీ ప్రాంతంలో విద్యుత్‌ తీగలు ఏర్పాటు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని కోరారు.

దొంగ ఓట్లను నమ్ముకుని రాజకీయం



లబ్ధిదారులకు బుక్‌లెట్‌ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: క్షేత్రస్థాయిలో ప్రజాదరణ కోల్పోయిన టీడీపీ 2024లో ఎలాగైనా గెలవాలని దొంగ ఓట్లను నమ్ముకుని రాజకీయం చేస్తుందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. సంక్షేమ పథకాలు, దీర్ఘకాలిక అభివృద్ధిలో దూసుకెళ్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే మూడో స్థానంలో ఉన్నారని, రాష్ట్రంలో రెండో సారి ముఖ్యమంత్రిగా గెలవడం తథ్యం కావడంతో, ప్రజాదరణ కోల్పోయిన టీడీపీ దొంగ ఓట్లను నమ్ముకుని కుట్రలు చేస్తోందని దుయ్యబట్టారు. పట్టణంలోని 30వ వార్డులో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరాలు తెలియజేసి వారికి బుక్‌లెట్లను అందజేశారు. ఎమ్మెల్యే ప్రజలతో పలుచోట్ల మాట్లాడారు. ప్రజలను మోసం చేసే టీడీపీకి రానున్న ఎన్నికల్లోనూ మరోసారి పరాజయం తప్పదన్నారు. కుప్పంలో కూడా చంద్రబాబు ఓటమి తథ్యమన్నారు. అందుకే చంద్రబాబు, టీడీపీ నాయకులు రాష్ట్రంలో 60 లక్షల దొంగ ఓట్లను రహస్యంగా సిద్ధం చేసుకున్నారని, వాటిపైనే ఆధారపడి ఉన్న విషయం ఇటీవల వెలుగులోకి వచ్చిందన్నారు. గత ఎన్నికల్లోనూ సుమారు 30 లక్షల ఓట్లను ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో తొలగించిందన్నారు. టీడీపీ హయాంలో నమోదైన దొంగ ఓట్లను గుర్తించి అధికారులు తొలగిస్తున్నారని, దొంగ ఓట్లు తొలగిస్తుంటే చంద్రబాబు, టీడీపీ నాయకులు అడ్డుపడుతున్నారని ఎమ్మెల్యే చెప్పారు. జగనన్న పాలనలో ఆంధ్రప్రదేశ్‌ అన్నింటా ముందు ఉందని, ప్రతి అంశంలోనూ ఏపీ ప్రభుత్వం ఆదర్శ ప్రాయమైన నిర్ణయాలే తీసుకుంటుండడంతో జాతీయ స్థాయిలో ఏపీ ప్రభుత్వానికి పలు అంశాల్లో కితాబులు దక్కుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి ప్రణాళికలు రచిస్తుంటే.. చంద్రబాబు మాత్రం కుట్రలకు ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. మున్సిపల్‌ కమిషనర్‌ ఈ. కిరణ్‌, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, చెన్ను ప్రసాద్‌ రెడ్డి, గంగు చంద్రశేఖర్‌, కనుపర్తి రాజశేఖర్‌, పొనుగోటి అనురాధ, గుర్రం వెంకటేశ్వర్లు, తల్లపనేని ప్రభాకర్‌నాయుడు, డేగా రాము, తిరువీధి ప్రసాద్‌, దామిశెట్టి సుధీర్‌, షేక్‌ నాయబ్‌ రసూల్‌, షేక్‌ ఖమర్‌ బాబు, పులి రజనీ, పులి చక్రపాణి, చేవూరు పద్మ, కలవకూరి ధనమ్మ, శారద ఫణీంద్ర పాల్గొన్నారు.

టీడీపీకే భవిష్యత్‌ లేదు

కావలి: ప్రజలను, ఆ పార్టీలో ఉన్న వ్యక్తులపై నమ్మకంలేని చంద్రబాబు రాష్ట్రంలో హింసను సృష్టించడానికి లోకేశ్‌, పవన్‌ చేత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నాయకులను రెచ్చగొట్టేలా నోటికి వచ్చిన తిట్లు, సవాళ్లు చేయిస్తున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కావలిలో శనివారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. టీడీపీ కే భవిష్యత్‌ లేకపోతే, ప్రజల భవిష్యత్‌కు గ్యారెంటీ అంటూ టీడీపీ నాయకులు మోసం చేసే గాలి కబుర్లు చెబుతున్నారని దుయ్యబట్టారు. వంచన, దగా, అబద్ధాలతో చంద్రబాబు టీడీపీని ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి లాక్కున్నారని, అదే స్కీమ్‌ను రానున్న ఎన్నికల్లో భవిష్యత్‌కు గ్యారెంటీ అంటూ చంద్రబాబు, టీడీపీ నాయకులు చెప్పే బురిడీ మాటలను ప్రజలు నమ్మడం లేదన్నారు. తరతరాలుగా ప్రజలను వెంటాడుతున్న పేదరికాన్ని రూపుమాపేందుకు జీవన ప్రమాణాలు, జీవితాలను మార్చే విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో భావి ప్రపంచంతో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పోటీపడుతున్నారన్నారు. ఈ నాలుగేళ్లలో జగనన్న పరిపాలనలో విద్య, వైద్యం, వ్యవసాయం, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నతమైన స్థానంలో నిలుస్తోందన్నారు. సంక్షేమాంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకుంటున్న మన రాష్ట్రాన్ని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఒక సర్వే చేసి ఆంధ్రప్రదేశ్‌ను మెచ్చుకుందన్నారు. దేశ వ్యాప్తంగా ఐదు లక్షల కుటుంబాల్ని ఆర్థికంగా, సామాజికంగా అన్ని విధాలుగా సంక్షేమ పథకాల ద్వారా మెరుగైన స్థితికి తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ఉందంటే, అది ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వమేనని కేంద్రమే గుర్తించిందన్నారు. ముఖ్యమంత్రిని వ్యక్తిగతంగా దూషించడం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిందలు వేయడం కోసమే లోకేశ్‌ పాదయాత్ర, పవన్‌కళ్యాణ్‌ వారాహి యాత్ర చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. ప్రజలకు ఏం చేస్తారో చెప్పకుండా అసభ్యంగా మాట్లాడి కార్యకర్తలను రెచ్చగొట్టడమే తండ్రీ కొడుకులు పనిగా పెట్టుకున్నారని ఎమ్మెల్యే చెప్పారు.

చౌకగా ఇంటి భోజనం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి
- కావలిలో 'ఆహా క్యాంటీన్‌' ప్రారంభం



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణానికి రాకపోకలు సాగించే పేద ప్రజల కోసం పొదుపు మహిళల ఆధ్వర్యంలో చౌకగా ఇంటి భోజనం అందించే విధంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆహా క్యాంటీన్‌' లను ఏర్పాటు చేశారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌ రెడ్డి అన్నారు. కావలి ఆర్టీసీ బస్టాండ్‌ ఎదురుగా ఉన్న అన్నపూర్ణ క్లాత్‌ మార్కెట్‌ వద్ద కావలి పట్టణ పొదుపు మహిళలతో 'మెప్మా' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆహా క్యాంటీన్‌'ను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలిలో రద్దీగా ఉండే ప్రాంతంలో కేవలం రూ.25లకే నాణ్యమైన మినీ మీల్స్‌ రూపంలో వెజ్‌రైస్‌, కరివేపాకు రైస్‌, సాంబారు రైస్‌, లెమన్‌ రైస్‌, ఆవకాయ రైస్‌, కర్డ్‌రైస్‌, టమోటా రైస్‌ తదితర ఆహారాన్ని ప్రతి సామాన్యుడి ఆకలిని తీర్చే ఆలోచనతో ఏర్పాటు చేయడం శుభపరిణామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో సీఎం వైఎస్‌ జగన్‌ పేదలకు పౌష్టికాహారాన్ని సామాన్య ప్రజలకు, నిరుపేద ప్రజలకు, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి రాకపోకలు సాగించే పేద ప్రజలకు అందుబాటులో ఉండేలా చేశారన్నారు. ఇటు బయట నుంచి వచ్చే ప్రజల ఆకలి తీర్చడంతో పాటు పొదుపు మహిళలకు ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా జిల్లా పీడీ రవీంద్ర, మున్సిపల్‌ కమిషనరు ఈ. కిరణ్‌, సీఎంఎం భారతి, సీఓలు కొండయ్య, అరుణ కుమారి, ఝాన్సీలక్ష్మి, ఆర్పీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కుందుర్తి శ్రీనివాసులు, గంధం ప్రసన్నాంజనేయులు, చెన్ను ప్రసాద్‌ రెడ్డి, నున్నా మురళి, పవిత్రన్‌, అమరా శ్రీనివాసులు, కోటా వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ జీతాల పెంపునకు విజ్ఞప్తి



అంగన్‌వాడీలు తమ సమస్యలు తెలియజేస్తూ అందజేస్తున్న అర్జీని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: అంగన్‌వాడీలకు వేతనాలు పెంపు, గ్రాట్యూటీ అమలు, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్‌, హెల్పర్స్‌ యూనియన్‌ నాయకులు తనకు విజ్ఞప్తి చేశారని సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి లేఖలో నివేదించారు. ఐసీడీఎస్‌ పరిరక్షణలో భాగంగా అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పింఛన్‌, పీఎఫ్‌ తదితరాలతో పాటు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని కోరుతున్నారన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి, బీమా అమలు చేయాలని కోరారన్నారు. సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారన్నారు. గ్రేడ్‌ సూపర్‌వైజర్‌ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని, పెండింగ్‌లో ఉన్న గ్రేడ్‌ -2 సూపర్‌వైజర్‌ పోస్టుల్లో మిగిలిన 164 పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారన్నారు.

చట్టాలు, బాధ్యతలపై అవగాహన అవసరం

- బి.రాజేష్‌, సీనియర్‌ సివిల్‌ జడ్జి



మాట్లాడుతున్న సీనియర్‌ సివిల్‌ జడ్జి బి.రాజేష్‌

ఆత్మకూరు: విద్యార్థి దశ నుంచే భారతరాజ్యాంగం ప్రకారం చట్టాలు, బాధ్యతలు తెలుసుకోవాలని, అవగాహన కలిగి ఉండాలని ఆత్మకూరు కోర్టు సీనియర్‌ సివిల్‌ జడ్జి బి.రాజేష్‌ అన్నారు. పట్టణంలోని ఎల్‌ఆర్‌ పల్లి జెడ్పీ హైస్కూల్‌లో మండల న్యాయసేవ అధికార సంఘం ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. జడ్జి రాజేష్‌ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ ప్రశ్నిస్తుంటారని, అదే క్రమంలో వారి బాధ్యతలను మరిచిపోవడం సరికాదన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే సచివాలయాల్లో, పోలీసుస్టేషన్లలో సమాచారం ఇవ్వాలన్నారు. న్యాయవాది ఎల్‌వీ రమణయ్య, పాఠశాల హెచ్‌ఎం వాణి తదితరులు పాల్గొన్నారు.

మేలుజాతి పశువులతో అధిక పాల దిగుబడులు

- జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ సోమయ్య



లేగదూడల ప్రదర్శనలో దూడల యజమానులకు బహుమతులు అందిస్తున్న సోమయ్య

జలదంకి: అధిక పాలదిగుబడులకు పాడి రైతులు మేలుజాతి పశువులను ఎంపిక చేసుకోవాలని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌ టి. సోమయ్య అన్నారు. శనివారం మండలంలోని బ్రాహ్మణక్రాకలో లేగదూడల ప్రదర్శన, పెయ్యదూడల ఉత్పత్తి పథకంపై అవగాహనా సదస్సును సోమయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు లేగదూడలను సంరక్షించుకుని మేలుజాతి పాడి పశువులుగా వృద్ధి చేసుకోవాలన్నారు. రాష్ట్రీయ గోకుల్‌మిషన్‌ పథకంలో భాగంగా జాతీయ కృత్రిమ గర్భధారణతో మేలుజాతి పశువుల ఉత్పత్తి చేసుకోవాలన్నారు. ఆవులను పోషించే రైతులు జెర్సీ, ఒంగోలు తదితర మేలుజాతి రకాలను, గేదెల్లో అయితే ముర్రా జాతి రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఇవి రోజుకు 7 నుంచి 8 లీటర్ల పాలు ఇస్తాయని, ఏడాదిలో 300 రోజుల పాటు ఇస్తాయన్నారు. ముర్రా, ఒంగోలు జాతి కుర్ర దూడలను, ఒంగోలు జాతి ఆబోతు దూడలను రూ.20 వేలకు కొండాపురం మండలంలోని చింతలదేవి ఫారం నుంచి అందిస్తామని తెలిపారు. పాడిరైతులు 1962కు ఫోన్‌ చేసి పశువుల అంబులెన్స్‌ను ఉపయోగించుకోవాలన్నారు. కావలి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు మంగేశ్వరరావు లేగ దూడల్లో వచ్చే వ్యాధులు, జున్ను పాల ఆవశ్యకత, దాణా మిశ్రమ తయారీ తదితరాలపై అవగాహన కల్పించారు. అనంతరం లేగ దూడల ప్రదర్శనలో జాతి లక్షణాలు, పెరుగుదల, పోషణ తదితరాల ఆధారంగా బహుమతులు అందించారు. దూడలకు ఏలికపాము మందులు ఉచితంగా అందించారు. లేగదూడల ప్రదర్శలో మొదటి బహుమతి గుమ్మడి మనోహర్‌, రెండో బహుమతి చిట్టేటి మనోహర్‌, మూడో బహుమతి వెంకటకృష్ణ లేగ దూడలకు అందాయి. స్థానిక రైతు పున్నం రోశిరెడ్డి సదస్సు ఏర్పాటుకు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణక్రాక సర్పంచ్‌ ఇండ్ల సుధాకర్‌, సర్వాయపాళెం, బ్రాహ్మణక్రాక, జలదంకి, కొండాపురం పశు వైద్యాధికారులు వెంకటేశ్వర నాయక్‌, షబ్నమ్‌, ప్రవీణ్‌, మహమ్మద్‌ అలీ, పశు వైద్య సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

'జంప్‌ రోప్‌'కు ఎంపికలు

కావలి: రాష్ట్ర స్థాయి జంప్‌ రోప్‌ పోటీల్లో పాల్గొనే సబ్‌ జూనియర్‌, జూనియర్‌, సీనియర్‌ విభాగాల్లో విద్యార్థిని విద్యార్థులను ఎంపిక ప్రక్రియ కావలి పాతూరులోని శ్రీచైతన్య స్కూల్‌ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆర్గనైజర్‌ ఎస్‌.శ్రీధర్‌రెడ్డి చెప్పారు. జిల్లా జంప్‌ రోప్‌ సెలక్షన్‌ పాల్గొనే విద్యార్థులు ఆధార్‌ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్లను వెంట తెచ్చుకోవాలన్నారు. తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 8919036160 సంప్రదించాలని తెలిపారు.

రేపు గడప గడపకు మన ప్రభుత్వం

సీతారామపురం: మండలంలోని అయ్యవారిపల్లి సచివాలయ పరిధిలో సోమ, మంగళవారాల్లో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని మండల కన్వీనర్‌ చింతంరెడ్డి సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.


గడప గడపకు నిధులతో బోర్ల నిర్మాణం



బోర్లు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేస్తున్న ప్రత్యేక నిధులతో పలు వార్డుల్లో మంచి నీటి బోర్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి చెప్పారు. 36 వార్డుకు చెందిన స్థానికులు తాగునీటి సమస్య తెలియజేయడంతో పరిష్కారంగా శనివారం రూ.3 లక్షలతో రెండు బోర్లు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ ఇ.కిరణ్‌, ఇన్‌చార్జి డీఈ సాయినాథ్‌, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, సమాధి రవి, జయంపు రమేష్‌, కొమరగిరి అబ్రహం, ఏటూరి పిచ్చిరెడ్డి, గుడ్లూరు మాల్యాద్రి, ఏగూరు చిన్న పుల్లయ్య, గంధం ప్రసన్నాంజనేయులు, కుందుర్తి శ్రీనివాసులు, చెన్ను ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన మరో మహిళ మృతి



జిలుముడి కామాక్షి (ఫైల్‌)

అల్లూరు: రాపూరు–చిట్వేలి ఘాట్‌ రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయపడిన మరో మహిళ శనివారం మృతి చెందింది. మండలంలోని చెర్లో సంఘానికి చెందిన జిలుముడి కామాక్షి (35) ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో కోమాలోకి వెళ్లిపోయింది. సుమారు 8 గంటలు మృత్యువుతో పోరాడి శనివారం మృతి చెందడంతో చెర్లో సంఘానికి చెందిన వారిలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో చల్లా సుజాత (45) మృతి చెందగా కోమరగిరి కృష్ణవేణి, జిలుముడి కామాక్షి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స పొందుతూ కామాక్షి మృతి చెందింది.



ఆస్పత్రిలో భవన ప్రారంభం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఎందరికో స్ఫూర్తి అన్నదానం

- రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి
- ప్రభుత్వాస్పత్రిలో దాత నిర్మించిన నూతన భవనాలు ప్రారంభం

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో కంచి పరమేశ్వర్‌రెడ్డి సాంబశివా చారిటబుల్‌ ట్రస్ట్‌ ద్వారా నిత్యాన్నదానం నిర్వహించడం పలువురికి స్ఫూర్తిదాయకమని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. వేమిరెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు వంటి మెట్ట ప్రాంతంలో జిల్లా ఆస్పత్రి కలిగి ఉండడం ఈ ప్రాంత వాసులకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు, వారి సహాయకులు భోజనానికి ఇబ్బందులు పడకుండా పరమేశ్వరరెడ్డి నిత్యాన్నదానం నిర్వహించడం మంచి కార్యక్రమన్నారు. తమ సంస్థ ద్వారా నెల్లూరులో పేద విద్యార్థుల కోసం ఉన్నత విలువలతో పాఠశాల నిర్వహిస్తున్నామని, నిత్యం 350 మందికిపైగా విద్యార్థులకు ఉచిత భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. నిత్యాన్నదానంలో కలిగే ఇబ్బందులు తనకు తెలుసునని, వాటిని అధికమించి కోట్లాది రూపాయల ఖర్చుతో నిత్యం 600 మందికిపైగా ఆస్పత్రికి వచ్చే వారికి భోజనం సరఫరా చేయడం అభినందనీయమన్నారు. పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో దాత రూ.60 లక్షల సొంత నిధులతో నిర్మించిన అన్నదాన భవనాన్ని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టిన ఊరికి ఏదైనా సేవ చేయాలనే సంకల్పంతో ఆత్మకూరు వాసి పరమేశ్వర్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం శుభ పరిణామమన్నారు. రుచికరమైన భోజనాన్ని ఆస్పత్రిలో రోగులతో పాటు సహాయకులకు, సిబ్బందికి అందజేయడం ఎంతో సౌకర్యంగా ఉందన్నారు. సొంత నిధులతో భవనాన్ని నిర్మించడం ఆయన సేవానిరతికి నిదర్శనమన్నారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గంలో 22 వాటర్‌ ప్లాంట్‌లు ఏర్పాటు చేశారని, నిత్యం లక్ష మందికిపైగా ఆ తాగునీరును వినియోగించుకుంటున్నారన్నారు. భవిష్యత్‌లోనూ ఈ కార్యక్రమం నిలిచి పోకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు దాత పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలను దాత ఘనంగా సత్కరించారు. తమిళనాడు రాష్ట్రం శివగంగై జిల్లా కలెక్టర్‌ మధుసూదన్‌ రెడ్డి, ట్రస్ట్‌ కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్‌ డాక్టర్‌ రమేష్‌ నాథ్‌, ఎంపీపీలు కేతా వేణుగోపాల్‌రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, చైర్‌పర్సన్‌ జి వెంకట రమణమ్మ, వైస్‌ చైర్మన్లు షేక్‌ సర్దార్‌, డాక్టర్‌ కేవీ శ్రావణ్‌కుమార్‌, విశ్రాంత హెచ్‌ఎంలు కేవీ శేషారెడ్డి, నారాయణ రావు, రాంపల్లి ప్రసాద్‌ రెడ్డి, కుడుముల సుధాకర్‌ రెడ్డి పాల్గొన్నారు.

నిర్విఘ్నంగా సంక్షేమం, అభివృద్ధి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



అక్కిదాసరి పద్మకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్‌: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయం పరిధిలో కోట్లాది రూపాయల అభివృద్ధి, సంక్షేమ పథకాలను నిర్విఘ్నంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చెప్పారు. మండలంలోని నువ్వూరుపాడు సచివాలయం పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఎమ్మెల్యేకు మహిళలు మంగళ హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు ఆరా తీశారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రతి పేద కుటుంబాన్ని ఆర్థిక అభివృద్ధి చేయడంతో పాటు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు ద్వారా పరిపాలనను ప్రజల వద్దకు చేర్చామన్నారు. నాలుగేళ్ల కాలంలో నువ్వూరుపాడు సచివాలయం పరిధిలో రూ. 22 కోట్ల మేర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించామన్నారు. 129 మంది వివిధ సమస్యలపై సర్వే సిబ్బందికి దరఖాస్తు చేసుకోగా అందులో 71 సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామన్నారు. ప్రత్యేకించి రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని నిర్దేశిత కాల పరిమితి లోగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళా సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. సచివాలయం పరిధిలోని పొదుపు సంఘాల మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన వారితో ముఖాముఖి చర్చించారు. పొదుపు రుణాలతో పాటు జగనన్న చేయూత, జీరో వడ్డీ తదితర ప్రోత్సాహకాలు మహిళలకు అందుతున్న విధానంపై వివరించారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

నువ్వూరుపాడు సచివాలయం పరిధిలోని అంబేద్కర్‌ నగర్‌ కాలనీకి చెందిన అక్కిదాసరి వెంకటేశ్వర్లు మృతి చెందడంతో ఆ కుటుంబం పడుతున్న ఇబ్బందులను స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. వెంకటేశ్వర్లు భార్య అక్కిదాసరి పద్మతో మాట్లాడిన ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, సిండికేట్‌ ఫార్మర్స్‌ సొసైటీ చైర్మన్‌ సానా వేణుగోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్‌ ప్రతాప్‌రెడ్డి, విద్యుత్‌ శాఖ ఏఈ వంగల్లు వెంకటేశ్వర్లు, వెలుగు ఏపీఎం వెంకమ్మ, ఏసీ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసులు, స్థానిక సర్పంచ్‌ కటారి దొరసానమ్మ, ఎంపీటీసీ గడ్డం సుచిత్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం శ్రీనివాసులురెడ్డి, గడ్డం విజయభాస్కర్‌ రెడ్డి, ఉగ్గల నరసారెడ్డి, దొడ్ల కృష్ణారెడ్డి, కటారి మాల్యాద్రి, షేక్‌ సుభాన్‌, ఖాజావలి పాల్గొన్నారు.

ఓటర్ల పరిశీలన ప్రక్రియలో అలసత్వం వహిస్తే చర్యలు

- సివిల్‌ సప్లయీస్‌ విజిలెన్స్‌ డిప్యూటి కలెక్టర్‌



సిబ్బందితో సమీక్షిస్తున్న సుధాకర్‌

ఉదయగిరి: ఓటరు పరిశీలన ప్రక్రియలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సివిల్‌ సప్లయీస్‌ విజిలెన్స్‌ డిప్యూటి కలెక్టర్‌ ఎంవీ సుధాకర్‌ తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల డేటా ఎంట్రీ ఆపరేటర్లతో తొలగించిన ఓట్లపై రీ వెరిఫికేషన్‌ నిర్వహించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో గతేడాది జనవరి 6వ తేదీ నుంచి ఇప్పటి వరకు 6,069 ఓట్లు వివిధ కారణాలతో తొలగించబడ్డాయన్నారు. అయితే అవి సక్రమంగా తొలగించారా లేదా అనే విషయంపై రీసర్వే వెరిఫికేషన్‌ చేపట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఎక్కువగా డెత్‌లు, డబుల్‌ ఎంట్రీలు ఉన్నాయన్నారు. చనిపోయిన వ్యక్తి ఓటు ఉన్నా, ఒకే వ్యక్తికి రెండు ఓట్లున్నా, ఓటర్లు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉన్నా ముందుగా వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అంగీకార పత్రం తీసుకుని ఓట్లు తొలగించాల్సి ఉంటుందన్నారు. తొలగించబడిన ఓటర్ల జాబితాను తహసీల్దార్‌ వద్ద అందుబాటులో ఉంచామన్నారు. అవసరమైన వారు ఆ జాబితాను పరిశీలించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ జగదీష్‌బాబు పాల్గొన్నారు.

సంక్షేమ పాలకుడు జగనన్న



లింగన్నపాలెంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ అందిస్తున్న రాజారెడ్డి, నాయకులు

- మేకపాటి రాజారెడ్డి

కొండాపురం: రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలకుడిగా చరితార్థుడు అయ్యారని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సత్యవోలు పంచాయతీ లింగన్నపాళెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామాల్లో రాజారెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూల మాలలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు బొట్టు పెట్టి హారతులిచ్చారు. రాజారెడ్డి అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందించారు. స్థానికులు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇళ్లు నిర్మించాలని రాజారెడ్డి దృష్టికి తెచ్చారు. సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలంటూ అధికారులను ఆదేశించారు. రాజారెడ్డి మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో పాలన సాగుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా తమ ప్రభుత్వం ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. అర్హులందరికీ కూడు, గూడు, విద్య, వైద్యం, తాగునీరు, కనీస వసతుల కల్పించి ఆదుకుంటుంటే చంద్రబాబు, దత్త పుత్రుడు, ఎల్లో మీడియా విషం చిమ్ముతూ అభివృద్ధికి అవరోధకులుగా మారారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గల్లంతు కావడం ఖాయమని తెలిపారు. మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చిమ్మిలి రవీంద్ర, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్‌ పలుచూరి మాల్యాద్రి, గుడవళ్లూరు, గరిమెనపెంట సొసైటీ డైరెక్టర్లు మన్నం వెంకటసుబ్బయ్య, పిన్నిక కొండయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బుర్రెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ లెక్కల వెంకటరమణయ్య, ఎడ్లపల్లి వెంకటరమణయ్య, యరజాల మాల్యాద్రి, దాసరి వెంకటేశ్వర్లు, దాసరి రాజా, చిన్నారెడ్డి, మార్తాటి వెంగయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.